# నాన్న ఉత్తరం

ఆంగ్లమూలం : విక్రమ్ కపూర్
అనువాదం : అన్వేషి చిలుకూరి



సునీల్ స్కూలు అయిపోయిన తరువాత ఆ వీధి చివరన వున్న మిఠాయి కొట్టు దగ్గర అమ్మకోసం ఎదురుచూస్తూ ఉంటాడు. ఆ షాపు యజమాని హర్‌ప్రీత్ గిల్ చాలా సరదా అయిన మనిషి. సిక్కు మతస్తుడు. అతనికి సునీల్‌పై గల అభిమానం వల్ల చాక్లెట్లనో, ఇతర తిండి పదార్థాలనూ ఇస్తూ ఉంటాడు. ఆ షాపు లోపలి భాగం చల్లగా వుండడం మూలాన ఢిల్లీలో వున్న తాపంనుండీ హాయిని కలిగిస్తూ వుంటుంది.

ఆ మధ్యాహ్నం స్కూలు బయట వున్న పేవ్‌మెంట్ మీద సునీల్ ఉండటాన్ని మహీప్ చూసింది. తను నడుపుతూ వున్న ఇక్ష్వాకుల కాలం నాటి ఫియట్ కారును ఆఫ్‌చేసి వాడికోసం వెళ్దామంటే, ఆ డొక్కు ఇంజన్లు ఆఫ్‌చేస్తే మళ్లీ స్టార్ట్ కాకపోవచ్చు. ఇల్లు చేరేవరకైనా అది పనిచేస్తేచాలు – అందుకే కారు దిగకుండానే వాడికోసం హారన్ మోగించింది.

సునీల్ పరుగెత్తుకు వచ్చాడు. తన స్కూలు బ్యాగును కారు వెనక సీట్లో పడేసి, అమ్మ పక్కన కూచున్నాడు. వాడికి ఏడేళ్లు వుంటాయి. సన్నగా తెల్లగా వుంటాడు. వాడి క్రాఫ్ మాడుకు కొద్దిగా ఎత్తున సన్నని వెంట్రుకలతో నిండి

వుంటుంది. మామూలుగా స్కూలు వదిలాక ఆరోజు జరిగిన విషయాలన్నీ పూస గుచ్చినట్టు సునీల్ వివరిస్తుంటాడు. కానీ, ఆరోజు దిగులుగా తల వంచుకుని కూచుని వున్నాడు. అప్పుడప్పుడూ కిటికీలోంచి బైటికి చూస్తూ వున్నాడు.

చివరికి మహీపే అడిగింది – ''స్కూలు ఎలా ఉందిరా?'' అంటూ.

''బాగుంది''

మళ్ళీ వాడు కిటికీలోంచి చూడ్డం మొదలుపెట్టాడు. మహీప్ వాడివైపు చూసింది. మామూలుగా స్కూల్లో ఏదైనా గొడవ జరిగితేనో, క్లాస్‌మేట్స్‌తో గొడవ పడితేనో, లేకుంటే టీచర్ తిడితేనో అలా వుండడం జరుగుతుంది. ఏం జరిగిందో కాసేపు వేచి చూడాల్సిందే.

''అమ్మా మనం నిజంగా సిక్కులమేనా?'' అడిగాడు సునీల్.

ఆ ప్రశ్న మహీప్‌ను ఆశ్చర్యానికి గురిచేసింది. వాడేమన్నా తమాషాకు అలా అడిగాడేమోనని సునీల్ వంక చూసింది. కానీ వాడి ముఖం సీరియస్‌గానే వుంది.

''అవును! కానీ ఈ అనుమానం నీకు ఎందుకు వచ్చింది?'' అంది ఆమె.

''గుర్‌ప్రీత్ అన్నాడు. మనం సిక్కుమతస్తులం కాదంట. అందుకే నాడు పొడవాటి జుట్టు లేదంట'' అన్నాడు సునీల్.

''గుర్‌ప్రీత్ ఎవరు?''

''గిల్ అంకుల్ వాళ్ళ మేనల్లుడు. ఈరోజు షాపులో అన్నాడు. ఇవాళ అతనే అంకుల్ వాళ్ల షాపును చూసుకుంటున్నాడు.''

మహీప్ అప్పుడు గాలి పీల్చుకుంది.

''మనం సిక్కు మతస్తులమే కానీ, నువ్వు సిక్కు కావడానికి పొడవైన జుట్టు పెంచాల్సిన అవసరం లేదురా! ఎందుకంటే సినిమా యాక్టర్లు ధర్మేంద్ర, సన్నీడియోల్ ఉన్నారు చూడు...'' అంది మహీప్.

''కానీ నేను చూసిన ఫోటోల్లో నాన్నకు పొడవాటి జుట్టూ, గడ్డం ఉన్నాయి కదా!''

''మీ నాన్న కూడా దుబాయ్‌కి వెళ్ళేముందు జుట్టు కత్తిరించుకున్నాడురా! మనం సిక్కులమన్న భావన నీకు నీ మనసులో ఉండాలే కాని, అందరికీ కనిపించేలా ఉండాలని అనుకోకూడదు!'' అంది మహీప్.

కానీ సునీల్ ఎంతకీ నమ్మినట్లు కనబడలేదు. మహీప్ విషయాన్ని మార్చడానికి ప్రయత్నించింది.

''ఈరోజు మీ నాన్న దగ్గర్నుంచీ ఉత్తరం వచ్చిందిరా! అందులో నీ గురించి ప్రత్యేకించి రాశాడు'' అంది ఆమె.

సునీల్ ముఖంలో నవ్వు విరిసింది.

''నాన్న ఇంటికి వస్తున్నాడా?'' అడిగాడు సునీల్ ఆత్రంగా.

''ఆయనకు ఇప్పుడప్పుడే సెలవు దొరికేలా లేదంట. అక్కడే ఇంకొద్ది రోజులు ఉండాలంట'' అంది ఆమె.

సునీల్ ముఖంలో నవ్వు మాయమైంది. వాడి చూపులు నేలమీదకు మళ్లాయి. అమ్రిక్ నుంచి వచ్చే ఉత్తరాలు ఇంకెంతోకాలం రావడం మంచిదికాదని ఆమె అనుకుంది.

వాళ్లిద్దరూ ఇల్లు చేరేవరకూ మాట్లాడుకోలేదు. ఏ ఇబ్బందీ లేకుండా ఇల్లు చేరినందుకు మహీప్ ఆనందించింది కూడా. కానీ ఆమె కారును పార్క్ చేయడం మొదలెట్టగానే ఇంజిన్ ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినప్పటికీ అది తిరిగి స్టార్ట్ అవడానికి మొరాయించింది.

ఆ కారు ఆగిపోయిన చోటే దాన్ని వదిలేసి వాళ్ల ఫ్లాటుకు వెళ్ళడానికి మెట్లు ఎక్కడం మొదలెట్టారు. వాళ్లు ఢిల్లీ డవలప్‌మెంట్ అథారిటీ ఫ్లాట్‌లో ఉంటున్నారు. అది మూడు గదుల చిన్న ఫ్లాటు. మహీప్ తల్లి దల్‌బీర్ తలుపు తీయగానే లోపలికి వెళ్లారు. వెళ్లగానే సునీల్‌ని వాళ్లమ్మమ్మ ప్రేమగా కౌగిలించుకుని, ఆరోజు స్కూల్లో జరిగిన విశేషాలను గురించి అడగడం మొదలెట్టింది. ఆమెతో కొద్దిసేపు మాట్లాడి సునీల్ తన స్కూలు యూనిఫాం మార్చుకోడానికి వెళ్లాడు.

''మీ నాన్న ఉత్తరం చదవవా?'' అంది మహీప్.

''తరువాత చదువుతాను'' అన్నాడు సునీల్.

వాడు వెళ్లిపోయి తరువాత దల్‌బీర్ మహీప్‌తో – ''వాడితో చెప్పి తీరాలి. వాడినుంచీ నిజాన్ని ఎంతోకాలం దాచలేవు'' అంది.

మహీప్ దాని గురించి మారు మాటాడలేదు. తను తిరిగి ఆఫీస్‌కు వెళ్లాలని అంది. దల్‌బీర్ కూడా ఆరు గంటలకు ఇంటికి వెళ్లాలని చెప్పింది. తను అంతలోనే తిరిగి వస్తానని చెప్పి మెల్లగా మెట్లు దిగనారంభించింది మహీప్.

అప్పటికే ఆమె అలసిపోయి ఉంది. రద్దీగా వున్న బస్సులో 30 నిముషాలు ప్రయాణం చేస్తే కానీ తను ఆఫీసుకు చేరలేదు. అయినా ఆఫీసుకు వెళ్లి తీరాల్సిందే. ఆమె టైపిస్టుగా పనిచేసే ఆఫీసులోని బాసు ఇంతకుముందే పని ఎగురగొడుతోందని హెచ్చరించాడు కూడా. అతని మందలింపును భరించే స్థితిలో ఇప్పుడు లేదు ఆమె.

ఆమె వీధిలోకి వచ్చింది. ఎండ వేడిమికి కళ్లు మండుతున్నాయి. ఒక ఆటో రిక్షావాడు పేవ్‌మెంట్ పక్కగా ఆటోని పార్క్‌చేసి నిలుచుని వున్నాడు. ఆమె ఖచ్చితంగా ఆటో ఎక్కుతుందనే అనుకున్నాడు. కానీ ఆమె అతన్ని దాటుకుని వెళ్లిపోయింది. ఆ ఆటోరిక్షా బస్సుకంటే వేగంగా, హాయిగా తీసుకువెళుతుంది. కానీ అవి నెలాఖరురోజులు. తన దగ్గర ఉన్న కాస్త డబ్బునే పొదుపుగా వాడుకోవాలి.

ఆమె ఊహించిందానికి ఎంతో విరుద్ధంగా అన్నీ వాటంతటవే జరిగిపోయాయి! 1984లో కొత్తగా ఆ ఫ్లాట్‌లోకి వెళ్లినపుడు పరిస్థితులు వేరుగా ఉండేవి. అప్పుడింకా సునీల్ పుట్టలేదు, ఆమె గర్భవతి. అప్పుడే అమ్రిక్‌కి బ్యాంకులో ప్రమోషన్ వచ్చింది. ఫ్లాట్ చాలా చిన్నదే కానీ, అది వారి సొంత స్థలం (అంతకుముందేమో వాళ్ళ బంధువులతో కలిసి వుండేవాళ్లు). అమ్రిక్ ఒక సెకండ్‌హ్యాండ్ కారును కొన్నాడు. కానీ అతను చెప్పిన ప్రకారం, అది కేవలం ప్రారంభం మాత్రమే. మరో రెండేళ్లలో మరో ప్రమోషన్ వస్తుందట, దాని తర్వాత మరొకటి... చిన్న ఫ్లాటు, పాత కారు.. ఇవన్నీ కేవలం జ్ఞాపకాలుగానే మిగిలాయి. ఇది కేవలం ప్రారంభపు మజిలీ మాత్రమే. త్వరలో అత్యున్నత శిఖరాలకు చేరుకునే దిశగా వెళుతున్నామని అతను చెప్పేవాడు.

ఇందిరాగాంధీ తన అంగరక్షకులైన సిక్కుల చేత కాల్చివేయబడిన ఆరోజు వాళ్ల జీవితాల్ని మార్చేసింది. ఆ రాత్రి ఎవరో వాళ్ల ఇంటి తలుపుమీద చాక్‌పీస్‌తో క్రాస్ గుర్తు పెట్టడం మహీప్ చూసింది. తరువాత అది తమని సిక్కు మతస్తుల ఇల్లని గుర్తించడానికి వీలుగా అలా గీశారని ఆమెకు అర్థమైంది. అనుకున్నట్టుగానే మరుసటిరోజు ఉదయం ఆ అల్లరిమూక వాళ్ల ఫ్లాట్‌పై దాడిచేశారు. అమ్రిక్‌ని గునపాలతో బాదారు. అతని ప్రాణాలకు హాని చేయవద్దని ఆమె కాళ్లావేళ్లాపడి ప్రార్థించింది. వాళ్లకి ఏం కావాలో అవన్నీ ఆ ఫ్లాట్‌లోంచి తీసుకున్నారు. అమ్రిక్‌ని వదిలేశారు. దానికి కారణం మహీప్ ప్రార్థన కాదు, ఆమె కడుపులో పెరుగుతున్న బిడ్డ కోసం. అయితే ఆ వెంటనే అమ్రిక్ మీద వేరేవాళ్ళు దాడిచేశారు. అవతలివాళ్ల మాటల్ని లెక్కచేయలేదు. అతనిమీద పెట్రోల్‌పోసి అంటించి వెళ్లారు. ఆ మంటల్ని ఆర్పడానికి మహీప్ తన శాయశక్తులా ప్రయత్నించింది. కానీ ఫలితం లేకపోయింది. తన కళ్లముందే అతను మాడి మసైపోయాడు.

జరిగిన విషయాన్ని సునీల్‌కి తను చెప్పలేకపోయింది. అందుకోసం సునీల్‌ను నమ్మించడానికి వాళ్ల నాన్న దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నట్టుగా కథ అల్లింది. సునీల్‌ను నమ్మించడానికి ప్రతి రెండువారాలకు ఒకసారి అమ్రిక్ రాసినట్టు తానే ఒక ఉత్తరం రాసి సునీల్‌కు ఇస్తూ ఉంటుంది. కానీ ఈ విషయం ఎక్కువ కాలం దాచలేనని ఇప్పుడే అర్థమయింది

ఇలా జరిగిన విషయాన్ని సునీల్‌కి తను చెప్పలేకపోయింది. అందుకోసం సునీల్‌ను నమ్మించడానికి వాళ్ల నాన్న దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నట్టుగా కథ అల్లింది. సునీల్‌ను నమ్మించడానికి ప్రతి రెండువారాలకు ఒకసారి అమ్రిక్ రాసినట్టు తానే ఒక ఉత్తరం రాసి సునీల్‌కు ఇస్తూ ఉంటుంది. కానీ ఈ విషయం ఎక్కువకాలం దాచలేనని ఇప్పుడే అర్థమయింది.

ఇవాళ సునీల్ తన జుట్టు గురించి అనుమానంగా అడిగాడు. రేపు హిందూ మతస్తులను పోలి ఉన్న తన పేరును గమనించి అడుగుతాడు. అంతేకాదు ఎందుకు మనం ఇంత చిన్న ఫ్లాట్‌లో, ఇంత డొక్కు కారుతో, ఇన్ని ఇబ్బందులు పడుతూ జీవిస్తున్నామని అడుగుతాడు. మిగతా కుటుంబాలన్నీ తండ్రి ఎక్కడ పనిచేస్తే అక్కడే ఉంటున్నాయి. మనమెందుకు అలా ఉండడంలేదు అన్న అనుమానం రావచ్చు.

అవును, సునీల్‌కు త్వరలో తన తండ్రి లేడన్న విషయాన్ని చెప్పేయాలి. అయితే అమ్రిక్ తన కళ్ల ముందే కాలిపోవడం వంటి సంఘటన మహీప్‌కు జీవితంలోనే చేదు అనుభవం. అందుకే ఈ విషయం సునీల్‌కు చెప్పకున్నా ఫర్వాలేదు అనిపిస్తూ ఉందామెకు. ■